# ప్రతిభావంతులైన అధ్యాపకులే కళాశాలకు కీలకం



అకాడమీ గురించి వివరిస్తున్న అంజిరెడ్డి, ముక్కామల అప్పారావు



అవయవ ప్రదర్శనశాలను పరిశీలిస్తున్న అమెరికా వైద్యుల బృందం

**చినకాకాని (గ్రామీణమంగళగిరి), న్యూస్ టుడే:** ప్రపంచంలో ఏ వైద్య కళాశాలకైనా అత్యుత్తమ అధ్యాపక బృందమే కీలకమని, అప్పుడే వైద్య విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని అమెరికా వైద్యుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని చినకాకాని ఎన్నారై ఆసుపత్రిని అమెరికా వైద్యుల సంఘం బృందం సోమవారం సందర్శించింది. అమెరికా వైద్యుల సంఘం కాబోయే అధ్యక్షుడు (ప్రెసిడెంట్ ఎలక్ట్) సిసిల్ బి.విల్సన్, తాజా మాజీ అధ్యక్షురాలు నాన్సి ఎన్.నెల్సన్, డానియల్ హెచ్.జాన్సన్ జూనియర్, రాన్డోల్ఫ్ డి.స్మోక్, ఆర్డిస్ డీ హోవెన్, జోసఫ్ పి.అన్నీస్, పీటర్ డబ్ల్యూ కార్మెల్ ఈ బృందంలో ఉన్నారు. ఈ బృంద సభ్యులు ఎన్నారై ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. హృద్రోగ విభాగంలో రోగులకు అందిస్తున్న చికిత్సలను గురించి విభాగాధిపతి డాక్టర్ గోపాకృష్ణ వివరించారు. ఎన్నారై వైద్య కళాశాలలో అనాటమీ విభాగాన్ని, అవయవాల ప్రదర్శనశాలను, తరగతి గదులు, సమావేశ మందిరాలను పరిశీలించారు. అమెరికా వైద్య కళాశాలల తరహాలో అత్యాధునిక సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారని ఎన్నారై అకాడమీ పాలకవర్గాన్ని ప్రశంసించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గతంలో రోగి చెప్పేది విని వైద్యులు రోగనిర్ధారణ చేసి దీనికనుగుణంగా చికిత్సలు చేసేవారని, కానీ వేగవంతమైన ప్రస్తుత సమాజంలో వైద్య పరీక్షలే కీలకమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నరాల శస్త్రచికిత్స (న్యూరాలజీ)లకు ఇది చాలా కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆధునిక వైద్యసేవలు ఖరీదవడంతో ఎక్కువమంది వినియోగించుకోలేకపోతున్నారని, దీనిపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరగాల్సి ఉందని బృందం పేర్కొంది. ఎన్నారై ఆసుపత్రిలో రోగులకు సేవలు బాగున్నాయని తెలిపారు. ఎన్నారై అకాడమీ డీన్ డాక్టర్ కె.అంజిరెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ ముక్కామల సుమతి, డాక్టర్ బుచ్చయ్య చౌదరి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.ఎస్. చౌదరి, వైస్ ప్రిన్సిపల్ వై.నాగిరెడ్డి, ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి వి.నళినీ మోహన్, ఆసుపత్రి పరిపాలనాధికారి కృష్ణకిశోర్, పి.ఆర్.ఒ. మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వైద్యం అందని ద్రాక్ష

**అమెరికన్ మెడికల్ అసోసియేషన్**

మంగళగిరి, న్యూస్‌లైన్

ఆధునిక వైద్యం పూర్తి స్థాయిలో గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం లేదని, ఇది అంతర్జాతీయంగా ఉన్న సమస్య అని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు సిసిల్ బి.విల్సన్ అభిప్రాయపడ్డారు. చినకాకాని ఎన్నారై మెడికల్ కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశంలో వైద్య విద్యకు, అమెరికాలోని వైద్య విద్యకు ఒకే రకమైన విధానాలున్నాయని తెలిపారు. మెడికల్ కాలేజీలకు మంచి బోధనా సిబ్బంది ఆయువుపట్టు అని తెలిపారు. ఎన్నారై కాలేజీకి సరైన సిబ్బంది ఉందని కితాబిచ్చారు. ఏఎంఏ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మైకెల్ డి.మేవ్స్ మాట్లాడుతూ వైద్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నారై జనరల్ ఆస్పత్రి గ్రామీణులకు, పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించడాన్ని అభినందించారు. రోగ నిర్ధారణకు డాక్టర్లకు సరైన అభిప్రాయం, అవగాహన ముఖ్యమని ఎ.ఎం.ఎ మాజీ అధ్యక్షురాలు నాన్సీ హెచ్.నీల్సన్ వ్యాఖ్యానించారు. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వివిధ పరీక్షలు ఖర్చుతో కూడినవే అయినా, కొన్ని రోగాల విషయంలో ఈ పరీక్షలు ఎంతగానో ఉపకరిస్తున్నాయని, దశాబ్దాలుగా అంతుచిక్కని వ్యాధులను కూడా ఈ పరీక్షల వల్ల నిర్ధారించగలుగుతున్నామని వివరించారు. ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు ఢిల్లీలో జరిగే అంతర్జాతీయ వైద్య సదస్సుకు హాజరయ్యేందుకు ఈ బృందం ఇండియా వచ్చింది.



సమావేశంలో పాల్గొన్న అమెరికన్ వైద్య బృందం

చినకాకాని ఎన్నారై ఆస్పత్రి నిర్వాహకుల ఆహ్వానం మేరకు కళాశాల, ఆస్పత్రిని అమెరికన్ బృందం సందర్శించింది. ఎన్నారై అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కాముల అప్పారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు జోసప్ ఎం.హేమాన్, డానియెల్ హెచ్ జాన్సన్, ఎ.డి.హూవెన్, జోసప్ పి.యన్నీస్, పీటర్ డబ్ల్యూ కర్మేల్, డీన్ డాక్టర్ కె.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.